10 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా!

- వికారాబాద్ జిల్లా కేంద్రంలో మూడున్నర ఎకరాల్లో నిర్మాణాలు
- కాంగ్రెస్ కౌన్సిలర్, మాజీ కౌన్సిలర్‌పై ఆరోపణలు
- రెవెన్యూ అధికారుల పైనా విమర్శలు

ఆలంపల్లిలో ప్రభుత్వ భూమి సర్వే నంబర్లను సూచిస్తున్న మ్యాప్

వికారాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): వికారాబాద్‌లో అధికారపక్ష నేతలు, అవినీతి అధికారుల కారణంగా రూ.10 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి అక్రమార్కుల పాలవుతున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాలంటూ ఓ పక్క నోటీసులు ఇస్తూనే, మరోపక్క రాత్రికి రాత్రే నిర్మాణాలు ప్రారంభిస్తున్నా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తున్నది. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఆలంపల్లి సర్వే నంబర్ 290, 291, 292లో 27 ఎకరాల 25 గుంటల ప్రభుత్వ భూమి ఉన్నది. ఈ భూమిలో 4 ఎకరాలు డబుల్ బెడ్రూం ఇండ్లకు కేటాయించగా మిగతా 23 ఎకరాల 25 గుంటల భూమి ఉన్నది. సంబంధిత భూమిలో కొందరు వ్యక్తులు దాదాపు మూడున్నర ఎకరాల వరకు కబ్జాచేసి అమ్ముకోవడంతో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. 2009లో ఇదే ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఇండ్ల నిర్మాణం చేపట్టారని అప్పటి సబ్ కలెక్టర్లు దాదాపు 56 మందిపై కేసులు నమోదు చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్, మాజీ కౌన్సిలర్ ప్రభుత్వ భూమిలో ప్లాట్లు చేసి ఒక్కో ప్లాటును రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలకు విక్రయిస్తున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే కబ్జాదారులకు రెవెన్యూ అధికారుల అండ ఉన్నట్టు తెలుస్తున్నది. ఇప్పటికే దాదాపు 30 మంది వరకు తహసీల్దార్ కార్యాలయం నుంచి 20 రోజుల క్రితమే నోటీసులు సైతం వెళ్లాయి. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టవద్దని, పనులు నిలిపి వేయాలని ఆదేశించారు. అయినప్పటికీ రాత్రికి రాత్రి ఇండ్ల నిర్మాణాలను కొనసాగిస్తుండటం గమనార్హం.

కబ్జాల వెనుక రెవెన్యూ యంత్రాంగం

ప్రభుత్వ స్థలం కబ్జా వెనుక రెవెన్యూ యంత్రాంగం హస్తం ఉన్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల అండతోనే నిర్మాణాలు చేపడుతున్నట్టు ప్రచారం జరుగుతున్నది. సంబంధిత ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారితోపాటు అక్రమంగా ఇండ్ల నిర్మాణం చేపడుతున్న వారి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుంటున్నట్టు ఆరోపిస్తున్నారు. ఒక్కో ఆక్రమణదారుడి నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నట్టు సమాచారం.

కబ్జాదారులపై చర్యలు తీసుకుంటాం

వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఆలంపల్లిలోని ప్రభుత్వ స్థలంలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తున్న విషయం వాస్తవమే. అక్రమ నిర్మాణాలు నిలిపివేయాలని ఆదేశించాం. అయినప్పటికీ నిర్మాణాలు చేపట్టిన దాదాపు 30 మందికి నోటీసులు పంపించాం. గడువులోగా నోటీసులకు స్పందించకపోతే కలెక్టర్‌కు నివేదిస్తాం. అక్రమంగా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మీనారాయణ, తహసీల్దార్, వికారాబాద్

అన్ని ప్రభుత్వ శాఖల్లో అవినీతి

- రెవెన్యూ, పోలీస్, రవాణాతో పాటు ఎక్సైజ్‌లోనూ ఎక్కువే
- వైరల్‌గా మారిన ఏసీబీ చీఫ్ సీవీ ఆనంద్ ట్వీట్స్

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): వివిధ ప్రభుత్వ శాఖల్లోని అవినీతి అధికారులపై ఇటీవల ఏసీబీ చేస్తున్న దాడులు చర్చనీయాంశంగా మారుతున్నాయి. ఇటీవల జడ్చర్ల ఎక్సైజ్ శాఖకు చెందిన ఇన్‌స్పెక్టర్ రత్నావత్ బాలాజీ రూ.65 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈ విషయాన్ని ఒక జర్నలిస్టు 'ఏసీబీ రాకింగ్' అనే శీర్షికతో ఎక్స్ (ట్విటర్)లో పోస్టు చేస్తూ.. ఏసీబీ డీజీ సీవీ ఆనంద్‌ను ట్యాగ్ చేశారు. దీనిపై సీవీ ఆనంద్ స్పందిస్తూ.. రాష్ట్రంలో రెవెన్యూ, పోలీసు, ట్రాన్స్‌పోర్టు మొదలైన వాటితోసహా ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ కూడా అత్యధిక అవినీతి శాఖల్లో ఒకటిగా నిలిచిందని రీట్వీట్ చేశారు. అది ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. లంచాలు తీసుకునే జలగలను ఎక్కడికక్కడే అరెస్టు చేయాలని నెట్‌జన్లు వ్యాఖ్యానిస్తున్నారు. అవినీతి అధికారులను అరెస్టు చేయడంలో ఇటీవల ఏసీబీ చాలా వేగంగా స్పందిస్తున్నదని ప్రశంసిస్తున్నారు.

సింగరేణి నియామకాలపై ఏసీబీ నజర్

హైదరాబాద్, జనవరి 24(నమస్తే తెలంగాణ): సింగరేణి నియామకాల్లో జరిగిన అక్రమాలపై ఏసీబీ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. సింగరేణిలో మెడికల్ ఇన్‌వాలిడేషన్ నియామకాల్లో జరిగిన అవినీతి, అక్రమాలకు సంబంధించి సంస్థ ఉన్నతాధికారుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన ఏసీబీ అధికారులకు కీలక ఆధారాలు లభించినట్టు తెలిసింది. నియామకాల పేరుతో డబ్బు వసూలు చేసిన పలువురు ఉద్యోగులను ఇప్పటికే సింగరేణి యాజమాన్యం సస్పెండ్ చేసింది. తాజాగా ఇదే అంశంపై సింగరేణి ఎండీ బలరాం ఏసీబీకి లేఖ రాశారు. దీంతో ఏసీబీ డీఎస్పీ రమేశ్ నేతృత్వంలో సింగరేణిలో నియామకాలపై దర్యాప్తు ముమ్మరంగా సాగుతున్నది. అలాగే పశుసంవర్ధక శాఖలోని గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన అవకతవకలు, ఫైళ్ల మాయంపై ఇటీవల ఎఫ్ఐఆర్ నమోదు చేసిన ఏసీబీ ఉన్నతాధికారులు విచారణ ముమ్మరం చేశారు. కాంట్రాక్టర్‌తో కలిసి పశుసంవర్ధక శాఖలోని నలుగురు అధికారులు, సిబ్బంది నిధులు గోల్‌మాల్ చేసినట్టు ప్రాథమికంగా గుర్తించారు. మొత్తం 133 గొర్రెల యూనిట్లకు చెల్లించాల్సిన రూ.2.20 కోట్లు దారి మళ్లినట్టు తేల్చారు.

పీఆర్టీయూ రాష్ట్ర కోశాధికారిగా దేవేందర్

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): పీఆర్టీయూ రాష్ట్ర కోశాధికారిగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పులి దేవేందర్ ఎన్నికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ నుంచి నియామక పత్రం అందుకొన్న దేవేందర్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు, 317 జీవో, పండిట్, పీఈటీ, కేజీబీవీ, మాడల్ స్కూళ్లలో సమస్యలను పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చిస్తానని చెప్పారు. సంఘ పటిష్టత, విస్తరణకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్ భిక్షంగౌడ్, గౌరవ ధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

ఎస్ఎంసీల పదవీకాలాన్ని పొడిగించాలి

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ)ల పదవీకాలాన్ని ఈ ఏడాది చివరి వరకు పొడిగించాలని ప్రభుత్వాన్ని తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్లా, ప్రధానకార్యదర్శి చందూరి రాజిరెడ్డి కోరారు. పాఠశాలల అవసరాలు, గణతంత్ర వేడుకల నిర్వహణ, టెస్ట్ పరీక్షల ఏర్పాట్లు, విద్యుత్తు బిల్లుల చెల్లింపు వంటి అత్యవసర ఖర్చులు హెచ్ఎంలు చెల్లించడానికి ఇబ్బందులు ఎదురవుతాయని వారు తెలిపారు. కావున, ప్రస్తుత కమిటీలను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

బాల్య వివాహాలు లేని సమాజం కావాలి

హైదరాబాద్, జనవరి 24(నమస్తే తెలంగాణ): 2030 నాటికి తెలంగాణ బాల్య వివాహాల రహిత రాష్ట్రమే లక్ష్యంగా ముందుకు సాగాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. బాల్య వివాహాలను అంతం చేయాలనే లక్ష్యంతో మహిళా, శిశు అభివృద్ధి (డబ్ల్యూసీడీ), స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (ఎస్ఎల్ఎస్ఏ), తెలంగాణ స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎస్సీపీసీఆర్), బచ్‌పన్ బచావో ఆందోళన్ (బీబీఏ) సంస్థలు బుధవారం హైదరాబాద్‌లో సదస్సు నిర్వహించాయి. ఈ సదస్సులో వైల్డ్ మ్యారేజ్ ఫ్రీ ఇండియా, బాల్య వివాహాలు, పిల్లల లైంగిక వేధింపులు అరికట్టడంలో ఎదురయ్యే సవాళ్లు, పరిష్కార మార్గాలపై అధికారులు, సంఘాల ప్రతినిధులు చర్చించారు. బాల్య వివాహాలపై పోరాటాన్ని ఉధృతం చేసేందుకు గ్రామస్థాయిలో బాలల సంరక్షణ కమిటీలను బలోపేతం చేయాలని సూచించారు.

టీఎస్ఐసీ సీఐవో శాంతాతౌటం రాజీనామా

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణ స్టేట్ ఇన్వెస్టమెంట్ సెల్ (టీఎస్ఐసీ) చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ డాక్టర్ శాంతాతౌటం బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. 'నా ప్రతిభను గుర్తించి తగిన అవకాశాలు కల్పించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు, ప్రభుత్వానికి ఎంతో రుణపడి ఉంటాను' అని ట్విట్టర్‌లో రాజీనామా విషయాన్ని వెల్లడించారు. ఐటీ రంగం అభివృద్ధికి కేటీఆర్ చేసిన కృషికి స్ఫూర్తి పొంది 2016లో యూఎస్ నుంచి తెలంగాణకు వచ్చానని పేర్కొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే

Follow us on @SCRailwayindia, ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును.

ప్రొఫార్మా 10-1
బహిరంగ ప్రకటన

దిగువ సూచించిన సెక్షన్‌లో పూర్తి చేయబడిన సెక్షన్ పైగల రైల్వే లైన్లు మరియు ఆవరణలను వినియోగించు వారందరికీ ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది:

సెక్షన్: విజయవాడ డివిజన్: కాజీపేట్–విజయవాడ సెక్షన్ మధ్య కొత్త BG మూడవ లైన్ నిర్మాణం–ప్రయాణీకుల బహిరంగ రవాణా కొరకు కి.మీ. 579.308 నుండి కి.మీ. 584.025 వరకు న్యూ వెస్ట్ బ్లాక్ హట్ యార్డ్ (మినహా) మరియు విజయవాడ జంక్షన్ యార్డ్ మధ్య కొత్త BG మూడవ లైన్ ప్రారంభానికి సంబంధించి (పొడవు : 4.714 కి.మీ.)

దక్షిణ మధ్య రైల్వేలో ప్రయాణీకుల బహిరంగ రవాణా కొరకు కి.మీ. 579.308 నుండి కి.మీ. 584.025 వరకు కాజీపేట్– విజయవాడ సెక్షన్‌లో న్యూ వెస్ట్ బ్లాక్ హట్ యార్డ్ (మినహా) మరియు విజయవాడ జంక్షన్ యార్డ్ మధ్య OHE మాస్ట్ లొకేషన్ 579/C5 (Km/Ch: 579/182.30) నుండి OHE మాస్ట్ లొకేషన్ 428/DY/1001 (Km/Ch: 428/817.60) వరకు 25000 ఓల్ట్, 50Hz, a.c. ఓవర్‌హెడ్ ట్రాక్షన్ వైర్లలో తేది: 05-02-2024న లేదా ఆ తర్వాత విద్యుత్ సరఫరా జరుగును. సదరు తేదీన మరియు సదరు తేది నుండి అన్ని వేళలా ఓవర్‌హెడ్ ట్రాక్షన్ లైన్లలో విద్యుత్ సరఫరా జరుగుతున్నట్టుగా పరిగణించబడును మరియు అనధీకృత వ్యక్తి ఎవరూ సదరు ఓవర్ హెడ్ లైన్ సమీపంలో పని చేయరాదు లేదా సమీపించరాదు.

ప్రొఫార్మా 10-2
ac 25kV ట్రాక్షన్ ప్రారంభం
"రహదారి వినియోగదారులకు హెచ్చరిక"

దిగువ సూచించిన సెక్షన్‌లో 25KV AC ఎలక్ట్రిక్ ట్రాక్షన్ ప్రారంభానికి సంబంధించి ప్రజలకు సమాచారమిచ్చు నిమిత్తం ఈ విధంగా ప్రకటించడమైనది:

సెక్షన్: విజయవాడ డివిజన్: కాజీపేట్–విజయవాడ సెక్షన్ మధ్య కొత్త BG మూడవ లైన్ నిర్మాణం–ప్రయాణీకుల బహిరంగ రవాణా కొరకు కి.మీ. 579.308 నుండి కి.మీ. 584.025 వరకు న్యూ వెస్ట్ బ్లాక్ హట్ యార్డ్ (మినహా) మరియు విజయవాడ జంక్షన్ యార్డ్ మధ్య కొత్త BG మూడవ లైన్ ప్రారంభానికి సంబంధించి (పొడవు : 4.714 కి.మీ.)

దక్షిణ మధ్య రైల్వేలో ప్రయాణీకుల బహిరంగ రవాణా కొరకు కి.మీ. 579.308 నుండి కి.మీ. 584.025 వరకు కాజీపేట్– విజయవాడ సెక్షన్‌లో న్యూ వెస్ట్ బ్లాక్ హట్ యార్డ్ (మినహా) మరియు విజయవాడ జంక్షన్ యార్డ్ మధ్య OHE మాస్ట్ లొకేషన్ 579/C5 (Km/Ch: 579/182.30) నుండి OHE మాస్ట్ లొకేషన్ 428/DY/1001 (Km/Ch: 428/817.60) వరకు లైవ్ ట్రాక్షన్ వైర్ (కాంటాక్ట్ వైర్) ప్రమాదకర సమీపానికి వెళ్లకుండా అత్యధిక ఎత్తుగల లోడ్స్‌తో వెళ్ళు వాహనములను నివారించు నిమిత్తం **రోడ్ లెవలకు ఎగువన 4.78m స్పష్టమైన గరిష్ఠ ఎత్తుతో అన్ని లెవల్ క్రాసింగ్స్ వద్ద హైటుగేజ్‌లు స్థాపించబడినవి.** ఇవి లెవెల్ క్రాసింగ్స్ వద్ద రైల్ లెవెల్‌కు పైన కనీసం 5.4m ఎత్తులో ఉంటాయి.

లోడ్‌తో వెళ్లు వాహనముల యొక్క కార్యార్థం కొరకు పైన నిర్దిష్టపరచిన ఎత్తును గమనించవలసిందిగా మరియు రహదారి వాహనములనందు తీసుకెళ్లు లోడ్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ హైట్ గేజ్‌లను అతిక్రమించరాదని ప్రజలకు ఇందుమూలంగా ప్రకటించడమైనది.

అత్యధిక ఎత్తుతో కూడిన లోడ్‌తో వెళ్లు వాహనములకు సంభవించే ప్రమాదాలు దిగువ విధంగా ఉంటాయి:

i) హైట్‌గేజ్‌కు ప్రమాదం మరియు తదుపరి రహదారికి మరియు అలాగే రైల్వే లైన్‌కు అవరోధం కలుగుతుంది.
ii) వాహనములపై తీసుకెళ్లు సామాగ్రికి లేదా పరికరాలకు లేదా వాహనములకు సైతం ప్రమాదం సంభవించవచ్చును.
iii) కండక్టర్లను తాకుట లేదా వాటి యొక్క ప్రమాదకర సమీపానికి వెళ్లు కారణంగా అగ్ని ప్రమాదం సంభవించవచ్చును మరియు ప్రాణాంతకం కావచ్చును.

A0089 డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, కన్‌స్ట్రక్షన్, విజయవాడ

కటకటాల్లోకి నెట్టిన 'ఫ్రీ చాకెట్లు' రీల్!

బంజారాహిల్స్, జనవరి 24: సూపర్ మార్కెట్‌లోకి ప్రవేశించి డబ్బులు చెల్లించకుండా చాక్లెట్లు తినడంతోపాటు 'ఫ్రీగా చాక్లెట్లు ఎలా తినాలో తెలుసా?' అంటూ వీడియోలు తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసిన యువకులపై ఫిలింనగర్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. షేక్‌పేట ప్రధాన రహదారిపై ఉన్న డీమార్ట్ సూపర్ మార్కెట్‌లోకి ఇటీవల హనుమంతనాయక్ అనే యువకుడు స్నేహితులతో కలిసి వెళ్లాడు. అమ్మడానికి పెట్టిన కొన్ని చాక్లెట్లను తింటూ ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ తీయడంతోపాటు బిల్లు చెల్లించకుండా చాక్లెట్లు ఎలా తినాలో తెలుసా? అంటూ వీడియోలో పేర్కొన్నాడు. ఈ వీడియోలను ఇన్‌స్టాగ్రామ్‌తోపాటు ఇతర సోషల్‌మీడియాల్లో పోస్టు చేశాడు. మంగళవారం ఈ వీడియోలను గుర్తించిన డీమార్ట్ షేక్‌పేట బ్రాంచ్ మేనేజర్ అర్జున్‌సింగ్ బుధవారం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చాక్లెట్లను తస్కరించిన హనుమంత్‌నాయక్‌తోపాటు అతడి స్నేహితులపై ఐపీసీ 420, 379 సెక్షన్లతోపాటు ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉత్తమ సింగరేణియన్‌గా జీఎం సురేశ్

- రిపబ్లిక్‌డే సందర్భంగా ఘన సన్మానం

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): ఈ ఏడాది సింగరేణి జనరల్ మేనేజర్ (కో–ఆర్డినేషన్, చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్) ఎం సురేశ్‌ను 'ఉత్తమ సింగరేణియన్' అవార్డు వరించింది. ఏటా రిపబ్లిక్ డే సందర్భంగా ఏరియా నుంచి ఉత్తమ అధికారిగా, అన్ని ఏరియాల్లో కలిపి అత్యుత్తమ అధికారుల్లో ఒకరిని 'ఉత్తమ సింగరేణియన్'గా ఎంపిక చేసి, సన్మానిస్తారు. ఈ ఏడాదికి సురేశ్ పేరును అవార్డుల ఎంపిక కమిటీ సిఫారసు చేసింది. 36 ఏండ్లుగా కంపెనీకి అందించిన విశిష్ట సేవలను, సమర్థ నాయకత్వ పటిమను గుర్తించి సురేశ్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. 1987లో మైనింగ్ గ్రాడ్యుయేట్ ట్రైనీగా సింగరేణిలో చేరిన సురేశ్ 36 ఏండ్ల లో 34 ఏండ్లుగా బొగ్గు గనుల్లోని ఉత్పత్తి విభాగాల్లో పనిచేయడం విశేషం. ములుగు జిల్లా జంగాలపల్లిలో జన్మించిన ఆయన అంచెలంచెలుగా ఎదుగుతూ.. జనరల్ మేనేజర్(కోఆర్డినేషన్) స్థాయికి చేరుకొన్నారు. అలాగే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా, సింగరేణి సేవా సమితి వైస్ ప్రెసిడెంట్‌గా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించారు. ఇప్పటికే ఆయన రాష్ట్రపతి చేతుల మీదుగా రెండుసార్లు 'నేషనల్ సేఫ్టీ అవార్డు' అందుకొన్నారు. నిరుడు ఆగస్టు 15న సీఎండీ చేతుల మీదుగా 'ఉత్తమ అధికారి'గా అవార్డు అందుకున్నారు.

ఢిల్లీ గణతంత్ర వేడుకలకు గుమ్మడిదల రైతు

హనీఫ్

గుమ్మడిదల, జనవరి 24: మల్చింగ్ విధానం ద్వారా సేంద్రియ కూరగాయలు సాగుచేస్తున్న సంగారెడ్డి జిల్లా రైతు మహ్మద్ హనీఫ్‌కు ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు కేంద్రం నుంచి ఆహ్వానం అందింది. గుమ్మడిదల మండలంలోని మంభాపూర్ శివారుకు చెందిన రైతు హనీఫ్ మల్చింగ్, పందిరి పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు సాధించి లాభాలు ఆర్జిస్తున్నారు.

రిపబ్లిక్ డే కోసం ఇద్దరు క్యాడెట్లు ఎంపిక

ఎం శ్రీశాంత్,

నాగండ్ల ధీరజ్

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): రిపబ్లిక్ డే వేడుకల కోసం దేశవ్యాప్తంగా 17 ఎస్సీసీ డైరెక్టరేట్ల నుంచి ఎంపిక చేసిన 9 మంది అత్యుత్తమ క్యాడెట్లలో ఏపీ, టీఎస్ రీజియన్‌కు చెందిన ఇద్దరు క్యాడెట్లు ఎంపికైనట్టు డిఫెన్స్ విభాగం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. తిరుపతి గ్రూప్ నుంచి జేడీ/జేడబ్ల్యూ ఆర్మీ విభాగంలో బెస్ట్ క్యాడెట్‌గా సార్జంట్ ఎం శ్రీశాంత్, సికింద్రాబాద్ గ్రూప్ నుంచి జేడీ/జేడబ్ల్యూ నేవీ విభాగంలో బెస్ట్ క్యాడెట్‌గా సీడీటీ నాగండ్ల ధీరజ్ ఎంపికయ్యారు. చిన్న వయసులోనే అద్భుతమైన ప్రతిభ కనబర్చిన ఈ ఇద్దరు క్యాడెట్లను అధికారులు అభినందించారు. వీరిద్దరూ ఏపీ, టీఎస్ ఎస్సీసీ డైరెక్టరేట్‌కు ఎనలేని ఖ్యాతిని తీసుకొచ్చారని ఎస్సీసీ అధికారులు కొనియాడారు.

నల్ల కాగితాలను కరెన్సీగా మారుస్తారట!

- మోసగిస్తున్న ముఠా అరెస్టు
- అదుపులో ఇద్దరు విదేశీయులు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 24 (నమస్తే తెలంగాణ): నల్ల కాగితాలను రసాయనంతో కడిగితే రూ.500 నోట్లుగా మారుతాయంటూ అమాయకులను మోసగిస్తున్న విదేశీ ముఠాను మల్కాజిగిరి ఎస్వోటీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఫుడ్ డెలివరీ బాయ్‌గా జొమాటోలో పనిచేస్తున్న బోడుప్పల్ వాసి విష్ణువర్ధన్‌రెడ్డి ఈ ముఠా చేతిలో రూ.5 లక్షలు మోసపోయినట్టు ఫిర్యాదు అందడంతో కామెరూన్ దేశానికి చెందిన కొంబి ఫ్రాంక్ సెడ్రిక్, మాలే దేశానికి చెందిన గోటి సౌంగలో అనే నిందితులను అరెస్టు చేసినట్టు రాచకొండ సీపీ సుధీర్‌బాబు బుధవారం వెల్లడించారు. వారి నుంచి రూ.25 వేల నకిలీ కరెన్సీ నోట్లు, కెమికల్స్, మొబైల్ ఫోన్, పాస్‌పోర్టు, ఐరన్ బాక్స్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కొంబి ఫ్రాంక్ సెడ్రిక్ వీసా గడువు ముగిసినప్పటికీ ఢిల్లీ, గుర్గావ్‌లో 2020 నుంచి అక్రమంగా నివసిస్తున్నాడని, ఈ ముఠాలోని ఇతర సభ్యుల కోసం గాలిస్తున్నామన్నారు.

ఉమెన్ సేఫ్టీ వింగ్ దేశానికే ఆదర్శం

ఇండక్షన్ బ్యాచ్ ఐపీఎస్‌లతో ఏడీజీ శిఖాగోయెల్

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఉమెన్ సేఫ్టీ వింగ్ చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆ వింగ్ అడిషనల్ డీజీ శిఖాగోయెల్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని ఉమెన్‌సేఫ్టీ వింగ్ కార్యాలయంలో జాతీయ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 43 మంది ఇండక్షన్ ఐపీఎస్ బ్యాచ్‌కు తమ విభాగం పనితీరును వివరించారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి మహిళలు, చిన్నారుల భద్రత కోసం ప్రభుత్వాలు చేస్తున్న కృషిని వెల్లడించారు.

సింగరేణిలో వన్ డే జాబ్!

మొదటిపేజీ తరువాయి...

పొందిన అభ్యర్థులు 18న కేటాయించిన ఏరియాల్లో జీఎంలకు రిపోర్ట్ చేశారు. వారికి సెక్షన్లు కూడా అలాట్ చేశారు. దీంతో డిసెంబర్ 19న వాళ్లంతా విధులు నిర్వహించారు. మస్టర్ కూడా పడింది. అదేరోజు సాయంత్రం ఆయా ఏరియాల జీఎంల నుంచి రేపటి నుంచి విధుల్లోకి రావొద్దంటూ మౌఖిక ఆదేశాలు వచ్చాయి. తర్వాతి రోజు అడిగితే సింగరేణి ఎన్నికలు నడుస్తున్నయ్.. ఎన్నికల కోడ్ ఉందని ఆపేశామని చెప్పారు. చివరకు సింగరేణి ఎన్నికల కోడ్ ముగిశాక డిసెంబర్ 27న జీఎం ఆఫీసుకు వెళ్లి అడిగితే.. తమకు పై నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని చెప్పారు. దీనిపై సింగరేణి సీఎండీ బలరామ్‌ను నాలుగైదుసార్లు కలిసినా, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసినా ఒకరిపై ఒకరు కారణాలు చెప్పి తప్పించుకుంటున్నారని బాధితులు వాపోతున్నారు.

అయోమయంలో ఉద్యోగులు

ఉద్యోగాలు పొందిన 146 మందిలో 29 మంది కో–ఆపరేటివ్ బ్యాంకుల్లో, వివిధ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్లు, పంచాయతీ, మున్సిపల్ శాఖల్లో వివిధ హోదాల్లో ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నారు. ఈ ఉద్యోగం వచ్చిందని వారంతా సింగరేణి నిబంధనల మేరకు డిసెంబర్ 1వ తేదీకి ముందుగానే పాత ఉద్యోగాలకు రాజీనామాలు చేశారు. మరో 40 మంది ప్రైవేట్ సెక్టార్లలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా, ఇతర కంపెనీల్లో పెద్ద హోదాల్లో పని చేసి సింగరేణి ఉద్యోగం వచ్చిందని రిజైన్ చేశారు. ఉద్యోగం ఇచ్చి ఒక రోజు పని కూడా చేయించుకున్న సింగరేణి యాజమాన్యం.. మరుసటి రోజే విధులకు రావొద్దని చెప్పడంతో ఈ కుటుంబాలన్నీ ఇప్పుడు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కొసమెరుపు ఏమిటంటే.. కౌన్సెలింగ్ జరిగిన రోజు ఈ 146 మందితో సింగరేణి సంస్థ రూ.2 లక్షలకు బాండ్ రాయించుకున్నది. ఈ సమయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకున్నది. తాజాగా ఒకరిద్దరికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయి. వాళ్లు వెళ్లి సర్టిఫికెట్లు అడిగితే రూ.2 లక్షలు కడితేనే ఇస్తామంటూ అధికారులు చెప్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇటు ఉద్యోగం, అటు సర్టిఫికెట్లు ఇవ్వక నానా అవస్థలు పడాల్సిన దుస్థితి వచ్చింది.

కాంగ్రెస్ క్రెడిట్ కోసమేనా?

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ గెలిస్తే రూ.2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే సింగరేణి సంస్థలో భర్తీ చేసే ఉద్యోగాలకు కాంగ్రెస్ తరఫున నియామక పత్రాలు ఇచ్చి ఆ క్రెడిట్ కొట్టేసేందుకు ఇదంతా చేస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి సింగరేణి పబ్లిక్ సెక్టార్ కంపెనీ, ఉద్యోగాల రిక్రూట్‌మెంట్ అనేది ఆ సంస్థ అంతర్గత విషయం. ఇందులో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదు. ఈ చిన్న లాజిక్ తెలుసుకోకుండా ఇచ్చిన ఉద్యోగాలను ఆపి, ఉద్యోగులను ఇబ్బందులు పెట్టడం ఏమిటని సింగరేణి సంస్థలోనే ఉన్నత హోదాలో పని చేసే పలువురు పెదవి విరుస్తున్నారు. ఇవేగాకుండా సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో కేసీఆర్ సర్కార్ ఉన్నప్పుడు కారుణ్య నియామకాలకు క్లియరెన్స్ పొందిన మరో 400కి పైగా పోస్టులను ఆపేశారు. ఇందులో శిక్షణ పూర్తి చేసుకొని విధుల్లో చేరేందుకు సిద్ధమైన వారు 100 మంది తోపాటు కొత్తగా శిక్షణకు అర్హత సాధించిన వారు 300 మందికిపైగా ఉన్నారు. ఈ ఉద్యోగాలు కూడా తామే ఇచ్చినట్టు ప్రచారం చేసుకోవడానికి, ఇప్పుడున్న ప్రభుత్వ పెద్దల చేతుల మీదుగా తిరిగి మరొకసారి నియామక ఉత్తర్వులు అందజేయడానినే సింగరేణి